

# అనగనగా ఓ మంచి కథ

# ఎదురు దెబ్బ

## తాళ్ళూరు నాగేశ్వర్రావు

(కృష్ణాపత్రిక - 1963 మార్చి, సంచికనుంచి పునర్ముద్రితం)




సరిగ్గా మూడు గంటల పదినిముషాలకు బిట్రగుంట ప్యాసింజర్ ను విజయవాడ స్టేషన్ మెల్లగా సాగనంపింది. గాలి సమ్మె చేయగా, మధ్య వయస్సు దాటిన ఎండ తన తీక్షణత్వాన్ని చూపిస్తోంది. లేడీస్ సెకండు క్లాసు బోగీలోని ఫ్యాన్లు అంతకు వారం రోజుల క్రితమే రిపేరు చేసే మెకానిక్ కోసం దరఖాస్తు పెట్టుకుని నిశ్చలంగా నిరీక్షిస్తున్నాయి.

పాము నడకన బయలుదేరిన బిట్రగుంట ప్యాసింజరు బండి పక్షి వేగాన్ని అందుకొనకముందే, లేడీస్ సెకండు క్లాసు బోగీలో ఆలోచనల గొడుగువిప్పుకొని కూర్చున్న సుబ్బలక్ష్మి ఓ స్త్రీని పిల్లవాడ్నీ ఆ ఎదుట చూసింది. ఆ కంపార్ట్మెంట్ లో వాళ్ళిద్దరే ఉన్నారు. రెండవ పుట్టినరోజు పండుగను పక్షంరోజుల్లో జరుపుకునేందుకు ఆజీలుగా వున్న ఆ పిల్లవాడు తల్లి ఒడిలో కులాసాగా కూర్చున్నాడు. చేతిలో ఏదో బొమ్మ ఉన్నది. ట్రైన్ కృష్ణా బ్రిడ్జి మీదనుంచి చప్పుడు చేస్తోపోతుంటే ఆ పిల్లవాడు విశేషమైన ఉత్సాహంతో కేరింతలు కొడుతున్నాడు. ఆ పిల్లవాని తల్లి మటుకు నుదురుపై కుడిచేయి పెట్టుకొనిరెండు గంటల క్రితం ఆరంభమైన తలనొప్పిని తగ్గించుకొనేందుకు ప్రయత్నిస్తోంది. సీటుపై ఏటవాలుగా కూర్చుంది. ట్రైన్ స్టేషన్ కు వచ్చేముందు శారిడాన్ బిళ్ళ వేసుకొని వేడి కాఫీ సేవించింది గానీ తలనొప్పి సద్దుమణగలేదు. ప్రయాణమంటేనే ఆమెకు తలనొప్పి. అందులో ప్రయాణీకుల ఓర్పును పరీక్షించే యీ రైళ్ళలో ప్రయాణం _ పూర్వజన్మలో శిక్షగానే అగపడుతుంది.

ట్రైన్ క్రిష్ణా బ్రిడ్జి దాటింది.

ఆ కుర్రవానికేసి దృష్టి నిల్పి చూసింది సుబ్బలక్ష్మి. ఎంత బావున్నాడు? ఎంతగా ముద్దువస్తున్నాడు పాలుగారే ఆ ముఖమూ, నెలవంకను గుర్తుకు తెచ్చే ఆ బుల్లి పెదవులూ, సూర్యుని ఆఖరి కాంతి వంటి ఆ శరీరచ్ఛాయా, నీలాకాశపు అమాయకత్వాన్ని కలిసివున్న ఆకళ్ళు, మల్లె మొగ్గలాగా వున్న ఆ ముక్కూ, మెడచుట్టూ గుండ్రటిదనమూ, దూదిపింజెలవలె వున్న ఆ కాళ్ళూ, చేతులూ ఎంతో మనోహరంగా వున్నాడు? ఇట్లాంటి పిల్లవానికి తల్లి కావటం పూర్వజన్మ సుకృతమే! తండ్రి ఎవరో? ఒరలోంచి కత్తి దూసినట్టుగా ఆమెలో ఓ అనుమానం మెరిసింది. ఆ ముఖంతీరూ, ఉంగరాల జుత్తూ, కంఠపు గుండ్రదనమూ, శరీరచ్ఛాయా, కళ్ళూ... కృష్ణమోహన్ ను స్ఫురణకు తేవడం లేదూ! ఈ పిల్లవాడు కృష్ణమోహన్ కొడుకా! ఆమె అతని భార్యా! అట్లా

ఉన్నదేం! సన్నగా, గాలికి పడిపోయేట్టుగా. ముఖంలో అందం ఆకర్షణ లేదు. పైగా అంద విహీనతను చూపుడు వేలితో చూపిస్తున్నట్టుగా పళ్ళు ఎత్తు; తలకట్టులో సొగసు లేదు. రైల్వే ప్లాట్ ఫారం లాంటి వక్షస్థలం కొండపల్లి బొమ్మలాగా వున్న ఆమెను కృష్ణమోహన్ ఎట్లా పెళ్ళి చేసికొనివుంటాడు. పదిహేనెకరాల పొలమూ, యాభైవేల రూపాయల నిల్వా, ఒక్కతే ఆడపిల్లా_కామోసు. అందుకే స్త్రీ సౌందర్యానికీ, ప్రేమకు అభిమానానికి ప్రాముఖ్యమివ్వకుండ _ ఆ చెక్కబొమ్మను తెచ్చుకున్నాడు! ఈనాటి యువకుల ప్రేమలూ, ఆదర్శాలూ మాటల్లోనేగానీ ఆచరణకు వచ్చేసరికి భయపడతారు, బెదిరిపోతారు డబ్బుపై వ్యామోహానికి లొంగి పోతారు మృగతృష్ణలాంటి వీళ్ళ ప్రేమల్ని నమ్ముకొన్న స్త్రీలను నిలువునా అగాధాల్లోకి దించుతారు.

అయిదేళ్ళక్రితం కాలేజీలో చదువుతున్నప్పుడు తను కృష్ణమోహన్ ను గాఢంగా ప్రేమించింది. అతను చాలా బావుంటాడు. కాలేజీలో చదివే వెయ్యిమంది విధ్యార్థుల్లో అతనే అందమైన వాడు. చక్కగా మాట్లాడతాడు నాటకాల్లో డిబేట్సులో హుషారుగా పాల్గొనేవాడు తెలివైన వాడు, క్లాసులో ఫస్టుమార్కులే వొచ్చేవి. తనకి కూడా 'కాలేజీబ్యూటీ' అన్నగొప్పపేరు ఉండేది. తనని చూసేందుకూ, తన ప్రేమను పొందేందుకు, అభిమానాన్ని చూరగొనేందుకు_ విధ్యార్థులు విరివిగా తహతహలాడేవాళ్ళు. కాని తన మనస్సు మటుకు కృష్ణమోహన్ పై లగ్నమైంది. అతను కూడా తనని ప్రేమిస్తున్నట్టు తెల్సుకున్నప్పుడు తనుపొందిన ఆనందానికి అవధులు లేకపోయినయ్. అతనే తనకి ముందుగా ప్రేమ లేఖ వ్రాశాడు. ఆ లేఖకు తను మూడుగంటలసేపు ప్రయాసపడి సంతృప్తిగా సమాధానం వ్రాసింది. ఆ లేఖలో సర్వస్వమూ అర్పించినట్టు స్పష్టంగా తెలియపరిచింది తను. తర్వాత సినిమా హాలులో కల్సికొన్నప్పుడు కూడా ఆతనిమీద తనకు గల నిజమైన ప్రేమను తెలియజేసింది. అతనూతనని గాఢాతిగాఢంగా ప్రేమిస్తూన్నట్టు చెప్పాడు. తర్వాత ఆ పైన తామిదరి మధ్య నడిచిన లేఖల్లో, సంభాషణల్లో, చూపుల్లో భావాల్లో_ వివాహం చేసికొని జీవితాల్ని స్వర్గతుల్యం చేసికుందామన్న, అభిప్రాయం గట్టిపడింది. అతనుకూడా 'నిన్ను తప్పకుండా పెళ్ళిచేసికుంటాను' అన్నాడు తనతో. కాని తనని పెళ్ళి చేసికోలేదు. తనని మోసగించాడు. తన హృదయంలో ఆశల్ని రేకెత్తించి, తనకళ్ళ ఎదుట చక్కటి సుందరలోకాన్ని కల్పించి, తన భవిష్యత్తును బంగారుభూమిగా మారుస్తానని వాగ్దానం చేసి_ చివరకు తనదారి తనని చూస్కోమన్నాడు. వాళ్ళ తల్లిదండ్రుల్ని ఎదిరించలేడట. కాలం కల్సిరాలేదట. భగవంతునికి కరుణలేదట తన అసమర్థతను బయటపెట్టుకోలేక పిరికివాళ్ళు నేరాన్ని భగవంతుని పై వేస్తారు. వయస్సు కలిగించే మోహాన్నీ ప్రేమగా చాటుకుంటారు గానీ _ ఆత్మసాక్షిగా ప్రేమించి, ఆ ప్రేమ సాఫల్యతకు ఎట్లాంటి త్యాగానికైనా సంసిద్ధులు కారు. కృష్ణమోహన్ పిరికివాడు. పచ్చి మోసగాడు. స్త్రీ హృదయంతో ఆటలాడే విలాస పురుషుడు. పెళ్ళి చేసుకున్నాక మొసలి కన్నీళ్ళు కారుస్తూ, 'క్షమించమని' తనకు లేఖ వ్రాశాడు. ఎంత సులభంగా అర్థించాడు 'క్షమించమని?...' తనకి ఆ సంవత్సరమే వివాహమైంది. ఆయనగారు కృష్ణమోహన్ వంటి అందమైన వాడు కాకపోవచ్చు. కాని సహృదయులు. బాగానే చదువుకొన, ఉద్యోగం చేస్తూన్నవారు. తమకూ రెండున్నర సంవత్సరాల కూతురుఉన్నది. అందమైనదే... కృష్ణమోహన్ ఇప్పుడెక్కడ ఉన్నాడో! ఎక్కడ ఉద్యోగం చేస్తున్నాడో! ఈ పిల్లవాడు అతనికొడుకే అయివుండవచ్చు. తన అనుమానం వాస్తవం కావచ్చు... సుబ్బలక్ష్మ ఆ విధమైన ఆలోచనలలో సతమతమవుతూండగా ప్యాసింజర్ ట్రైన్ క్రిష్ణా కెనాల్ స్టేషన్లో ఆగింది.

నారింజపండ్లు అమ్మే ఒకతను పెట్టెలోకి వచ్చి_ 'వడ్లపూడి నారింజకావాలా అమ్మా!' అని అడిగి వెళ్ళాడు. పిల్లవాడు కాయలకేసి ఎగాదిగా చూశాడు కానీ, తలనొప్పి బాధతోవున్నతల్లి పట్టించుకోలేదు.

ఆమెను పలకరించి ఆమె భర్త పుట్టు పూర్వోత్తరాలు కనుక్కోవాలనుకుంది సుబ్బలక్ష్మి.

"ఎంతవరకండీ ప్రయాణం?"

"తెనాలి" అన్నదామె శిరోభారం చేత కనుబొమ్మలు కదిలిస్తూ.

"మీ పుట్టిల్లు తెనాల్లో నేనా?"

"కాదండీ. కంకిపాడు, తెనాల్లో మా వారికి ఉద్యోగం."

"ఏం ఉద్యోగం?"

"ఇన్ కంటాక్సు ఇనస్పెక్టరు"

"వారి పేరు?"

"కృష్ణమోహన్"

"ఎంతవరకు చదివారు?"

"బందర్లో బి.ఏ. హైద్రాబాదులో ఎల్.ఎల్.బి"

"ఈ పిల్లవాడు మీ అబ్బాయేనా!?"

"అవునండీ!"

"మీ పేరు?"

"ఇందిర"

అన్ని ప్రశ్నలకూ ముక్తసరిగా సమాధానాలు చెప్పిందిగానీ ఇందిర ఒక్క ప్రశ్నవేయలేదు. కారణం ఆమె తలనొప్పితో బాధపడుతూండడమే.

ట్రైన్ పెద్దవడ్లపూడి స్టేషన్లో ఆగి బయల్దేరింది.

పిల్లవాడు తల్లి ఒడిలోంచి మెల్లగా దిగజారి క్రిందకు వొచ్చాడు బొమ్మతోసహా. సుబ్బలక్ష్మి ఆప్యాయంగా ఆ పిల్లవాడ్ని తన దగ్గరకు తీసికొంది. చక్కగా ముద్దాడింది. ఏవేవో మాట్లాడింది. నవ్వించింది, తను నవ్వింది, చప్పట్లు కొట్టింది. కిటికీలోంచి రైలు వేగానికి గిర గిరా తిరిగే చెట్లనూ, పొలాల్లోని పశువుల్ని, దూరంగా వున్న కొండల్ని_ వేలెత్తి చూపెట్టింది. పిల్లవాడు కొత్తదనం లేకుండానే సుబ్బలక్ష్మి సమక్షంలో కులాసాగా ఆడుకుంటున్నాడు.

తలనొప్పితో ఇందిర బర్త్ మీద మగతగా పడుకొంది.

ఓ మాదిరి వేగంతో పోతున్న ట్రైన్ పై సాయంత్రపు ఎండ పడుతోంది. అద్దాల కిటికీల్లోంచి ఎండ పొడలు బోగీల్లో దొర్లాడుతున్నాయి.

పిల్లవాడు బర్త్ మీద బొమ్మతో కుస్తీ పడుతున్నాడు.

సుబ్బలక్ష్మి కొంచెం సేపు కిటికీలోంచి బయటకు చూస్తూ కూర్చుంది. సంధ్యాకాంతికి ముఖాల్ని ఎరుపు చేసుకున్న మబ్బుల్నీ, చిరుగాలికి తలలు ఆడిస్తూన్న అరటి తోటల్నీ, రైలు చప్పుడుకు మోరలెత్తి వింతగా చూసే పశువుల్ని, నిశ్శబ్దంగా చూస్తూ కూర్చున్నప్పటికీ సుబ్బలక్ష్మి మనస్సు మురుగు కాలువ మాదిరిగా వుంది. ఆరిపోని నిప్పు రవ్వలాంటి అశాంతి హృదయంలో పొగల్ని రేపుతోంది. ఏదో తన కిష్టం లేనిది జరిగినట్టు, తనని మోసగించిన వాళ్ళు సుఖపడుతున్నట్టు_ఆమెలో అసూయ ద్వేషాలు నూట ఆరు డిగ్రీల ఉష్ణోగ్రతకు చేరుకున్నాయి.

కృష్ణమోహన్ కొడుకు ఎంత అందంగా ఉన్నాడు? తనని ప్రేమించి తృణీకరించిన కృష్ణమోహన్, తనని ప్రేమించి దగా చేసిన కృష్ణమోహన్ తన మనస్సులో మల్లెతోట పూయించి మాడ్చివేసిన కృష్ణమోహన్ ఈ ముద్దుల మురిపెపు కొడుకుని చూసికొని గర్వపడతాడు కాబోలు! తన నోటి దగ్గర్నుంచి అమృతపాత్రను హరించిన యీ ఇందిర_ విశ్వసౌందర్యపు వెలుగురేఖలాంటి కొడుకును చూసుకొని మురిసిపోతుంది కాబోలు మంచి ఉద్యోగం, భర్య తరపున కావాల్సినంత ఆస్తి, అందమైన కొడుకు తనన పెళ్ళి చేసుకోని కృష్ణ మోహన్ భవిష్యత్తు సుఖజీవనం కాబోలు!!!... దుష్టాత్ములకూ, మోసగాళ్ళకూ, స్వార్థపూరితులకూ ఈ కాలం సౌఖ్యాన్ని సమకూర్చే యంత్రంలాగా పని చేస్తోంది! కాని ఏది శాశ్వతం? ఈ ఆస్తీ, అందమూ, ఆనందమూ బ్రతకులు ఎల్లకాలమూ ప్రశాంతంగా నిలుస్తాయనే గ్యారంటీ ఏముంది? మానవుని జీవితం సుఖదుఃఖాల తోరణం లాంటిది. ఏ క్షణంలో ఏం జరుగుతుందో చెప్పడం కష్టంగదా! ఊహకందని భవిష్యత్తులో జీవితం అల్లల్లాడేటప్పుడు_ అనుకోని సంఘటనలు ఏ క్షణంలోనైనా జరగవచ్చు జీవితం ఎప్పుడైనా తారుమారు కావచ్చు పట్టాలు తొలగి యీ ట్రైన్ క్రిందపడితే_ బ్రతికేవాళ్ళెంతమంది? చనిపోయేదెంతమంది?... కాని ఇట్లాంటి వేదాంతానికి జీవితాన్ని పోల్చి చూసికొని సంతృప్తి పడటం సమంజసమేనా తన కడుపులోని మంట, హృదయంలో అశాంతి, మనస్సులో కల్లోలం ఎట్లా సద్దుమణుగుతాయి? ఏం చేయాలి తనేం చేయగలదు? తనకు సహించని పరిస్థితులపై పగదీర్చుకోవటమెట్లా? ప్రతీకార ద్వేషాగ్ని గాడిపొయ్యిపగిది గుండెలో కణకణ మండుతూండగా సుబ్బలక్ష్మి తీవ్రాతి తీవ్రంగా ఆలోచించనారంభించింది. రైలు చక్రాలంత వేగంగా ఆమె మస్తిష్కపు లేబరేటరీలో ఆలోచనల గొలుసు తిరుగుతూవుంది.

మగతగా బర్తుమీద పడుకున్న ఇందిరకు అకస్మాత్తుగా నిద్రపట్టింది.

పిల్లవాడు మెల్లగా బొమ్మ చేతపట్టుకొని బర్తుమీదనుంచి క్రిందకు దిగాడు.

గదిలో దీపం ఆర్పివేయగా చీకటి ఒక్కసారి కమ్ముకున్నట్టుగా సుబ్బలక్ష్మిలో ఆలోచించగా ఆలోచించగా ఓ దురాలోచనపు చీకటి ఒక్కసారి కమ్ముకుంది. ఆ దురాలోచనపు చీకటితో శరీరంలో ప్రతిభాగమూ పాషాణ సమమైనది. మానవత్వపు లక్షణాలు మృగ్యమైనాయి, పాపభీతి ఏములనో

కిక్కురుమనకుండా తల దాచుకుంది పగ, ద్వేషం, అసూయ స్త్రీలో భయంకరంగా కోరలు చాచుకున్నప్పుడు వాటిని తీర్చుకొనే ఆత్మతృప్తి కోసం, అవకాశాల కోసం, ఆమె ఎట్లా తహతహ లాడుతోందో అట్లావుంది సుబ్బలక్ష్మి.

ప్యాసింజరు ట్రైన్ బరువుగా కేకవేసి, దుగ్గిరాల స్టేషన్ను విడిచిపెట్టింది ఆ లేడీస్ సెకండ్ క్లాసు భోగీలో ఎవ్వరూ ఎక్కలేదు.

పల్చని మబ్బు సూర్యుడి మీద నైలాన్ తెరవలె కప్పగా సాయంత్రపు ఎండ శోభకొంచెంగా తగ్గింది.

పిల్లవాడు కంపార్టుమెంటులో కింద కూర్చుని బొమ్మతో ఆడుకుంటున్నాడు, తనలో తాను తెలియని తన్మయత్వాన్ని పొందుతున్నాడు ఇందిర నిద్రబోతూనే ఉంది.

ఆ సెకండు క్లాసు బోగీ పడమటి ప్రక్క తలుపు బార్లా తెరిచివుంది.

బకింగ్ హమ్ కెనాల్ బ్రిడ్జిని దాటేందుకు బిట్రగుంట ప్యాసింజరు శక్తిని కూడగట్టుకుంటోంది.

బర్తుమీదనుంచి లేచింది సుబ్బలక్ష్మి నాపరాతిలాంటి గుండెతో నిద్రబోతున్న ఇందిరకేసి కొన్ని క్షణాలపాటు చూసింది, ఆమె నిద్రనుంచి మేల్కొనే స్థితిలో లేదని నిశ్చయించుకుంది.

పిల్లవాడు ఉత్సాహంగా ఆడుకొంటూన్న బొమ్మను తీసుకుంది సుబ్బలక్ష్మి. వాడు జాలిగా ఆమెకేసి చూశాడు : 'నా బొమ్మనెందుకు తీసుకున్నావ్ ?' అన్న ప్రశ్న ధ్వనించేదు.

ఆ బొమ్మను కొన్ని క్షణాలపాటు నిమిరింది సుబ్బలక్ష్మి.

పిల్లవాడు ఆమె చీర కుచ్చిళ్ళు పట్టుకున్నాడు ఆమెకేసి తలఎత్తి చూస్తూ 'నా బొమ్మ నాకిచ్చేయ్' అన్న భావం ద్యోతకమవుతూండగా.

ట్రైన్ చప్పుడు చేసుకుంటూ బకింగ్ హామ్ కెనాల్ బ్రిడ్జి ఎక్కింది.

సూర్యుడిని కప్పిన నైలాన్ తెరలాంటి పల్చని మబ్బు తొలిగిపోగా ఎర్రని ఎండ తెరచివున్న వాకిట్లో కొట్టవచ్చినట్టుగా పడింది.

సుబ్బలక్ష్మి ఆ బొమ్మను కంపార్టుమెంటు తలుపు దగ్గరకు విసరివేసింది. పిల్లవాడు గబగబా వెళ్ళాడు ఆ బొమ్మను తీసికొనేందుకు. క్రిందకు వంగి ఆ బొమ్మను తీసికో బోతుండగా, ఆమె కాలితో బయటకు నెట్టింది. పిల్లవాడిలో కోపం, రోషం ఎక్కువై, ముఖమంతా పండిన దొండపండు కాగా, బయట పడిపోతూన్న ఆ బొమ్మను అందుకోబోతూ రబ్బరుబూటు కాలు జారి క్రిందబడ్డాడు.

అప్పుడు ట్రైన్ బ్రిడ్జి దిగుతూవుంది.

సుబ్బలక్ష్మి పెద్దగా కేకవేసి, గబుక్కుని ట్రైన్ గొలుసు లాగింది. నిద్రబోతూన్న ఇందిర ఆ కేకకు ఉలిక్కిపడి లేచింది.

"అబ్బాయి క్రిందపడి పోయాడు. నేను లెట్రిన్ లోకి వెళ్ళి వచ్చేసరికి పడిపోయాడు_ బొమ్మను అందుకోబోతూ" అన్నది సుబ్బలక్ష్మి భయంతో అంతర్లీనమైన ఆందోళనతో.

"బాబూ!" అంటూ కెవ్వున కేక వేసింది ఇందిర.

ట్రైను మెల్లగా ఆగింది. చాలామంది జనం క్రిందకు దూకారు ముఖ్యంగా పిల్లవాడు పడటాన్ని చూసినవాళ్ళు.

బ్రిడ్జి దిగువ కావటాన అది ఎత్తైన ప్రదేశం. అక్కడ చిన్న చిన్న రాళ్ళ మీద పడ్డ పిల్లవాడు క్రిందకు దొర్లుకుంటూ వెళ్ళి టెలిగ్రాఫ్ స్తంభం ప్రక్క ముళ్ళకంచెలో ఆగాడు.

ఇందిర బిగ్గరగా యేడుస్తూ అక్కడకు వెళ్ళింది.

నెత్తురు మడుగులో కుప్పగా కూలివున్నాడు పిల్లవాడు. తలక్రిందులుగా పడటం మూలాన బుర్రచిట్లి, నెత్తురు చిన్నరాళ్ళపై చిందింది. చేతులూ, కాళ్ళూ దోక్కుపోయి రక్తం ధారలు కట్టనారంభించింది. అంత ఎత్తు ప్రదేశాన్నుంచి దొర్లటం వల్ల పాలుగారే ముఖం పండిన రాములక్కాయ చితికినట్లయింది. వొళ్ళంతా తుమ్మముళ్ళమయం. టెర్లిన్ తెల్లచొక్కా క్రీమ్ కలర్ షార్క్ స్కిన్ నిక్కరూ నెత్తురు మరకలతో భీకరంగా వున్నాయి.

నెత్తురు చిందిన గడ్డలాగా వున్న కొడుకుని చూసి ఇందిర గుండె చెదరిపోయింది. చనిపోయిన పిల్లవాడ్ని వొళ్ళోకి తీసికొని_బావురు మన్నది.

ఆ దారుణ దృశ్యానికి అక్కడ చేరిన ప్రయాణీకుల హృదయాలు జాలితో కన్నీళ్ళు కార్చాయి.

"ఎట్లా జరిగింది ఘోరం?"

"జారి పడ్డాడా?"

"తల్లి ఏం చేస్తున్నది?"

"నిద్రపోతున్నదా!"

"ఇంకా ఆ పెట్టెలో ఎవ్వరూ లేరా?"

అక్కడ జేరిన ప్రయాణీకులు తలా ఒక విధంగా అనుకొని సమాధానాలు చెప్పుకోసాగారు.

అప్పటికే పదినిముషాలపాటు ట్రైన్ అక్కడాగింది సూర్యుడు తాటిచెట్ల గుంపు వెనక ఎర్రగా దిగజారుతున్నాడు.

ఆలస్యానికి గార్డు గాభరాపడ్డాడు. వెంటనే చనిపోయిన పిల్లవాడ్నీ కంటికీమంటికీ ఏకధారగా యేడుస్తున్న తల్లినీ_సెకండు క్లాసులోకి ఎక్కించి విజిల్ వేశాడు ట్రైన్ సాగారేందుకు.

ట్రైన్ బయలుదేరింది. శోకోద్విగ్న చిత్తయైన ఇందిర నరాలు తెగిపోయేట్టు ఏడుస్తూంది.

మరణించిన ఆ పిల్లవాడ్నీ, మాతృమూర్తి దుఃఖాన్నీ చూస్తున్న కొద్దీ సుబ్బలక్ష్మిలో క్రమంగా అధైర్యమూ, పాపభీతి, అశాంతీ ఎక్కువ కాసాగాయి. ఆమెను ఓదార్చేపట్టు మనస్సుకు లేకపోయింది. హృదయంలో ఓ మూల ప్రతీకారవాంఛ నెరవేరిన తాలూకు సంతృప్తి చిరునవ్వు నవ్వుతూన్నా,__ ఏదో భయం, నేరం చేసిన బెదురూ 'తనని భగవంతుడు శిక్షించకుండా వుంటాడా?' అన్న అలజడీ ఆమెలో తెరలు తెరలుగా సుళ్ళు తిరుగనారంభించాయి. వాటిని అణుచుకొనేందుకు సుబ్బలక్ష్మి శాయశక్తులా ప్రయత్నిస్తోంది.

ట్రైన్ తెనాలి స్టేషన్లో ఆగింది.

వెంటనే సుబ్బలక్ష్మి ప్లాట్ ఫారం మీదకు దిగింది. హేండ్ బాగ్ తీసికొని. ఆమె మనస్సంతా మహాగంద్రగోళంగా ఉంది! హత్యచేశాక తప్పించుకొనేందుకు హంతకుడెంతగా త్వరపడతాడో_ఆమెలో అట్లాంటి వేగం పరుగులు తీస్తోంది. పెట్టెలోంచి దిగుతూ ఆ పిల్లవాడ్నీ, తల్లినీ కూడా చూడలేకపోయింది. గబగబా స్టేషనుదాటి రిక్షాలో కూర్చుని 'నాజరుపేట పోనివ్వు' అన్నది.

సూర్యుడు ఫించినీ పుచ్చుకోవటంతో_మునిమాపు తాత్కాలికంగా ఉద్యోగంలో ప్రవేశించింది.

రణరంగ చౌకు మీదుగా, మారీసు పేటలోంచి, కొత్త వంతెనలు దాటి సత్యనారాయణ టాకీసు బజారునే, ఎల్.ఆర్.ఎమ్. క్లబ్బు ప్రక్కగా సుబ్బలక్ష్మి ఎక్కిన సైకిలు రిక్షావడిగా పోతోంది. అవన్నీదాటి వచ్చిన స్పృహలేదు. తననేరం బయట పడ్డట్టూ, తననెవరో తరుముకొస్తున్నట్టూ, ఆమెలో భయపు పొగలు పెత్తనం చలాయిస్తున్నాయి.

వేపచెట్టుక్రింద పాతడాబారాగానే "ఏయ్! రిక్షా ఆపు" అన్నది సుబ్బలక్ష్మి.

రిక్షా ఆగింది.

ఒక్క ఉదటున రిక్షాదిగి వాడిచేతిలో యాభై నయాపైసల బిళ్ళపెట్టి, చిల్లర అడగకండానే ఇంట్లో ప్రవేశించింది సుబ్బలక్ష్మి.

వీధివాకిలి మొగదల్లో వుండగానే ఆమెకు ఇంట్లోంచి ఏడ్పులు వినవచ్చాయి ప్రత్యేకం తన తల్లి యేడ్పు. ఇరుగు పొరుగు వాళ్ళు పదిమంది వరకూ ఉన్నారు. డాక్టరు శాస్త్రిగారు మెడలో స్టెతోస్కోపు తగిలించుకొని బయటికొస్తున్నారు.

ఆ వాతావరణం చూడగానే సుబ్బలక్ష్మి గుండె భయాందోళనతో గొంతులోకి వచ్చింది. నిలువునా నిశ్చేష్టురాలై నిలబెట్టిన బొమ్మలాగా నిలబడింది.

"అంతా అయిపోయింది" అన్నాడు వైద్య శాస్త్రపు అనుభవంతో వేదాంతాన్ని అలవర్చుకొన్న డాక్టర్ శాస్త్రి క్రింది పెదవి విరుస్తూ.

"మీ అమ్మాయి సాయంత్రం పెరట్లో ఆడుకుంటూ ఆడుకుంటూ వరల బావిలో పడింది. పైకితీసే సరికే ప్రాణం పోయింది. దానికి ఆయుస్సు నేటితో ఆఖరు కాబోలు!" అన్నాడు ప్రక్క ఇంటి సుందర్రామయ్య.

(ఐపోయింది)

★★

Click here to share your comments on this story.